రాజ్యాంగం పనితీరు.. జాతీయ సమీక్షా కమిషన్

రాజ్యాంగం అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు దాటాయి. ఆ నేపథ్యంలో దాని పని తీరును సమీక్షించడం, అవసరమైన మార్పులు సిఫారసు చేయడం సహజం. పౌర సమాజం ఒత్తిడి మేరకు ఫిబ్రవరి, 2000లో భారత ప్రభుత్వం, జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 11 మంది సభ్యుల ఈ కమిషన్ అధ్యక్షుడు న్యాయమూర్తి ఎం.ఎన్.వెంకటాచలయ్య. లోక్‌సభ సెక్రటరీ జనరల్‌గా పదవీ విరమణచేసి, సుప్రీంకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్న ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు సుభాష్ సి.కశ్యప్ కమిషన్ కార్యదర్శిగా వ్యవహరించారు. ఇది 2002, మార్చిలో తన నివేదిక సమర్పించింది. ఈ కమిషన్ దాదాపు 200 సిఫార్సులు చేసింది.



సిఫార్సుల్లో ముఖ్యమైనవి...

ఎ) ప్రాథమిక హక్కుల జాబితా:

- వార్తాపత్రికలు, ఇతర ప్రచార సాధనాల స్వాతంత్ర్యం
- సమాచార స్వాతంత్ర్యం
- కోర్టు ధిక్కార కేసులలో నిజాన్ని సమర్థించే అవకాశం
- కనీసం 80 రోజులకు తగ్గకుండా గ్రామీణ ప్రాంతంలో జీవనోపాధి
- సురక్షిత తాగునీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ
- ప్రాథమిక విద్య –ఈ అంశాలను చేర్చాలి.

బి) ఆదేశసూత్రాలు:

- జీవనోపాధి అవకాశాలు మరింత విస్తృతం చేయడానికి ప్రణాళికాబద్ధమైన కృషి
- ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి జాతీయ విద్యాకమిషన్ ఏర్పాటు
- ప్రజలలో అవగాహన పెంపొందించడం ద్వారా జనాభా నియంత్రణ
- మతసామరస్యాన్ని పెంపొందించడం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశ సూత్రాలను గావిస్తున్నతీరును సమీక్షించడానికి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం – అంశాలను చేర్చాలి.

సి) ప్రాథమిక విధులు:

రాజ్యాంగ ప్రకరణ 51ఎలో ''ఎన్నికలలో ఓటు వేయడం, ప్రజా స్వామ్య ప్రవృత్తిలో పౌరులు చురుకుగా పాల్గొనడం, పన్నులు చెల్లించడం'' అనే అంశాలను చేర్చాలి. న్యాయమూర్తి వర్మ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు ప్రాథమిక విధులపై ప్రజలలో విద్య, మీడియా రంగాల ద్వారా సరైన అవగాహన కలిగించాలి.

డి) ఎన్నికల ప్రవృత్తి:

ప్రతి ఓటరుకు గుర్తింపు కార్డు, అన్నిరాజకీయ పక్షాలకు సవరించిన ఓటర్ల లిస్టు సరఫరా, ఎలక్ట్రానిక్ ఓటింగ్ పరికరాన్ని ఎన్నికలలో ఉప యోగించడం, నేరస్థులను ఎన్నికలలో పోటీ చేయకుండా నివారించ డానికి ప్రజాప్రాతినిధ్య చట్టంలో అవసరమైన మార్పులు తేవడం, ఎన్నికల వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేయడం, ఎన్నికల ఖర్చును ప్రభుత్వం భరించడం, ప్రచార సమయాన్ని తగ్గించడం,అభ్యర్థులు తమ ఆస్తి వివరాలను తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేయడం, షెడ్యూల్ కులాలకు, తెగలకు రిజర్వు చేసిన నియోజకవర్గాల ఆవర్తనం(Rotation), మంత్రిమండలి సభ్యుల సంఖ్య దిగువ సభ సభ్యుల సంఖ్యలో 10శాతానికి పరిమితం చేయడం, స్వతంత్ర అభ్యర్థులను వీలైనంతవరకు పోటీ చేయకుండా నివా రించడం (ధరావత్తు విలువ పెంచడం ద్వారా), 25 శాతం కంటే తక్కువ ఓట్లు పొందిన అభ్యర్థి ధరావత్తు కోల్పోవడం, లోక్‌సభ/ శాసనసభా నాయకునిగా ఎన్నికైన వ్యక్తిని ప్రధానమంత్రిగా/ ముఖ్య మంత్రిగా నియమించడం, ప్రధాన ఎన్నికల అధికారి, యితర అధికా రులను–ప్రధానమంత్రి, లోక్‌సభ, రాజ్యసభలలో ప్రతిపక్ష నాయకులు, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మ న్ సభ్యులుగా ఉన్న కమిటీ సిఫార్సుల మేరకు నియమించాలి. పైన సూచించిన మార్పుల కోసం అవసరమైతే రాజ్యాంగ సవ రణ చేయాలి.

ఇ) రాజకీయ పక్షాలు:

రాజకీయ పక్షాల రిజిస్ట్రేషన్, దాని కార్యకలాపాల నియంత్రణకు సమగ్ర చట్టాన్ని రూపొందించాలి. దీని ఆర్థిక కార్యకలాపాలలో

పారదర్శకతను నెలకొల్పడానికి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఖాతాల తనిఖీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. నేరచరితులకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశమిచ్చిన పార్టీలను రద్దు చేయాలి. తామరతంపరగా పెరిగిపోతున్న చిన్న, చిన్న పార్టీలను కఠిన నిబంధన ద్వారా నిరోధించాలి. జర్మనీలో మాదిరిగా నిర్మా ణాత్మక అవిశ్వాస తీర్మాన (Constructive no confidence motion) విధానాన్ని ప్రవేశపెట్టాలి. రాజకీయ పక్షాలు సేకరించే విరాళాల విషయంలో పారదర్శకత అవసరం.

ఎఫ్) పార్లమెంట్ / రాష్ట్ర శాసనసభలు:

- బడ్జెట్‌పై పార్లమెంటు సరైన నియంత్రణకు వీలుగా బడ్జెట్ విషయాల నిపుణుల సేవలను అందుబాటులో ఉంచాలి. పార్లమెంటరీ కమిటీ బహిరంగ చర్చల ద్వారా బడ్జెట్ ప్రక్రియను ప్రభావవంతం చేయాలి.
- ఆర్థిక విషయాలు అధ్యయనం చేసి, తగు సిఫార్సులు చేయడానికి జాతీయ ఆర్థిక కమిటీని ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ ఖాతాల సంఘం, అంచనాల సంఘంను రద్దు చేయవచ్చు.
- పొరక్లేశ నివారణకై పిటిషన్ కమిటీని ఏర్పాటు చేయాలి. ఇది లోక్‌పాల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుంది.
- అంతర్జాతీయ ఒప్పందాలను పార్లమెంటు ఆమోదించాలి.
- పార్లమెంటు సమావేశ కాలం 100-120 రోజులు, రాష్ట్ర శాసనసభల సమావేశం 70-90 రోజులు కొనసాగాలి.
- కంప్ట్రోలర్,ఆడిటర్ జనరల్ నియామక ప్రక్రియలో లోక్‌సభ స్పీకర్‌ను, ప్రభుత్వ ఖాతాల సంఘాన్ని సంప్రదించాలి.
- పార్లమెంట్ సభ్యుల స్థానిక అభివృద్ధి పథకాలకిచ్చే గ్రాంటును రద్దు చేయాలి (MPLAD Scheme)

జి) కార్యనిర్వాహక వర్గం:

- ప్రణాళికా ప్రక్రియకు జిల్లా ప్రాథమిక విభాగంగా పరిగణించాలి.
- ఉద్యోగుల నియామకం, బదిలీ, పదోన్నతి చర్యలు పరిశీలించడానికి స్వాధీన ప్రతిపత్తి కలిగిన సివిల్స్ బోర్డుకు అప్పగించాలి.
- సంయుక్త కార్యదర్శి పై స్థాయిలో నియామకాలు జరిపేటప్పుడు బయటివారికి కూడా అవకాశమివ్వాలి.
- సామాజిక తనిఖీకి ప్రాధాన్యతనివ్వాలి.
- అవినీతిపరులైన ఉద్యోగుల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. 311వ ప్రకరణను సవరించాలి. అక్రమంగా సంపాదించిన ఆస్తులను జప్తు చేయాలి. అవినీతి నిరోధక చట్టానికి మరింత పదును పెట్టాలి.
- లోక్‌పాల్ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలి.

హెచ్) న్యాయవ్యవస్థ:

జాతీయ న్యాయకమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ఇది న్యాయవ్య వస్థ జవాబుదారీతనానికి దోహదం చేయాలి. న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సు పెంచాలి. అధీన న్యాయస్థానాల నియంత్రణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా చేపట్టాలి. నిర్ణీత కాలవ్యవధిలో కేసులను పరిష్కరించాలి.

ఐ) కేంద్ర - రాష్ట్ర సంబంధాలు:

- ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ అంశాన్ని ఏడో షెడ్యూల్‌లో పొందుపరచాలి.
- నదీజలాల వివాదాలను పరిష్కరించడానికి కనీసం ముగ్గురు న్యాయమూర్తుల బెంచ్ ఏర్పాటు చేయాలి.
- అంతర్‌రాష్ట్రీయ మండలి సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలి.
- గవర్నర్ నియామక ప్రక్రియలో సర్కారియా కమిషన్ సిఫార్స్‌లు పాటించాలి.
- 356వ ప్రకరణను అరుదుగా ఉపయోగించాలి.
- ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న కొన్ని పన్నులను రాష్ట్రాల పరిధిలోకి తేవాలి.

రాజ్యాంగ పని తీరు సమీక్ష కమిషన్ 2000 ఫిబ్రవరి 23న ఏర్పాటైంది. ఈ కమిషన్ సభ్యులు

- జస్టిస్ ఎంఎన్. వెంకటాచలయ్య-చైర్మన్
- జస్టిస్ బి.పి.జీవన్ రెడ్డి
- జస్టిస్ ఆర్.ఎస్.సర్కారియా
- జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య
- పీఏ సంగ్మా
- సోలీ సోరాబ్జి
- కె.పరాశరన్
- డాక్టర్ సుభాష్ సి.కశ్యప్
- సి.ఆర్. ఇరానీ
- డాక్టర్ అబిద్ హుస్సేన్
- సుమిత్ర జి.కులకర్ణి